

కథ

# తండ్రి వంక వారు

కన్నడకథ: లింగారెడ్డి వి.ఆలూర్

అనువాదం: తత్త్వాది ప్రమోద్‌కుమార్

ఆకాశం నిండా చుక్కలు చెల్లాచెదురుగా ఉన్నాయి. పిల్లవాడు తలెత్తి పైకి చూశాడు. మిలమిలా మెరుస్తున్న చుక్కలన్నింటినీ తెంచుక రావాలన్న కోరిక కలిగింది. అదే భావనా విలాసం ఆ లేత కళ్లల్లో లాస్యమాడింది. ఉన్నట్లుండి పిల్లవాడి వీపుకు రెక్కలు మొలిచాయి. ఆ రెక్కలు క్రమంగా పెరుగుతూ పక్షి రెక్కలంతయ్యాయి. మెల్లగా రెక్కలాడిస్తూ ఆకాశం వైపు ఎగిరాడు. వెన్నముద్దల్లాంటి తెల్లమబ్బులను వెనుకకు నెట్టేస్తూ ముందుకెళ్లుతున్నాడు. మెరుస్తున్న చుక్కలను మెల్లగా తాకాడు. తెంచుకోవాలన్న ఆశ ఏర్పడింది. ఆకాశానికి అంటుకున్న చుక్కలను తెంచుకుంటూ జేబులో నింపుకున్నాడు. అంగీ,నిక్కరు జేబుల నిండా చుక్కల పళ్లు. జేబు నిండా మిరుమిట్లు గొలిపే వెలుగు. రెక్కలాడిస్తూ ముందుకెళ్లుతున్న పిల్లవాడు చంద్రుడి వైపు ఎగిరాడు. చంద్రుడు అచ్చంగా అవ్వ చేసిన రొట్టెలా ఉన్నాడు. అవ్వ రొట్టె నలుపు. చంద్రుడు తెలుపు. చంద్రుణ్ణి మెడలు వట్టి లాగసాగాడు. బలంగా నింగికి అంటుకున్న చంద్రుడు చేతుల్లోకి రాలేదు. నిరాశపడ్డాడు. బేల ముఖం వేసుకొని వెనుదిరిగాడు. నడిదారిలోకి రాగానే ఒకసారి జేబు తడుముకున్నాడు. జేబులో చుక్క ఒక్కటికూడా లేదు. చినిగిన అంగీ, నిక్కరు జేబులనుండి చుక్కలెక్కడో పడిపోయినట్లున్నాయి. తలపైకెత్తి చూశాడు. చుక్కలన్నీ అక్కడే ఆకాశంలోనే ఉన్నాయి. పిల్లవాడికి ఏడుపొచ్చింది. బిగ్గరగా ఏడ్వసాగాడు. మెలకువయ్యింది. లేచి కూర్చుని చుట్టూ కలయ చూశాడు. ఇదంతా కల! నిరాశతో నిట్టూర్చాడు.

గుడిసె అంతా చీకటిదే రాజ్యం. మూల మూలలా చీకటి దట్టంగా అలముకుంది. గుడిసె లోపలి పొయ్యి ముందర మాత్రం బుడ్డిదీపం సన్నగా వెలుగుతుంది. అది కూడా అప్పుడో ఇప్పుడో ఆరిపోతుందన్నట్లు కొన ఊపిరితో కొట్టుకుంటుంది. దాని ముందు చెదరిన తలతో కూర్చుంది ఆ పిల్లవాడి తల్లి. ఆమె ఎదురుగా రెండు సారా సీసాలు. సారాయి కంపు వాసన పిల్లవాడి ముక్కుకు తాకగానే వాంతి వచ్చినట్లయింది. వందల చిరుగులు వేల అతుకులతో కనిపించే చినిగినదుప్పటిని ముఖంనిండా కప్పుకొని పడుకున్నాడు. మళ్లీ రంగు రంగుల కలలు.

గుడిసె తలుపులు తట్టిన చప్పుడయింది.

ఆ చప్పుడుతో లేచివచ్చిన తల్లి తలుపు గడియ తీసింది. నల్లగావున్న ముసలి బసవన్న లోపలకు వస్తూనే ఆమెను వాటేసుకొంటూ, పొయ్యి ముందున్న తడకవెనుకకు వెళ్లాడు. మళ్లీ సారా సీసాల చప్పుడు. కొనఊపిరితో కొట్టుకుంటున్న దీపం కూడా ఆరిపోయింది ఆ చీకట్లో మసక మసకగా ఏదో దృశ్యం కనిపిస్తుంది. వాటేసుకున్న రెండుదేహాల ఆరాటం.... దొర్లడం... పొర్లడం... మూలుగులు... సారా కంపు వాసనతో పాటు వేడినిట్టూర్పులు కూడా కలిసిపోయాయి.

మొట్టమొదట వీటినన్నింటినీ నిద్ర నాపుకుంటూ కుతూహలంగా చూసిన పిల్లవాడికి ఇప్పుడు వాటి పట్ల ఎలాంటి ఆసక్తి లేదు. కలలు కనడమొక్కటే ఇప్పుడతని పని. ప్రతి రోజు కలల మూటవిప్పుకోవడానికై సాయంవేళ అవ్వ పెట్టిన అన్నం తిని పెందరాళే పడుకుంటాడు. దుప్పటి కప్పుకుని పడుకోవడమే చాలు. అర్థంపర్థంకాని, రంగులున్న, రంగుల్లేని రకరకాల కలలు. ఇదే వాడి దినచర్య...నొసటి రాత.

పిల్లవాడికి తన తల్లి పేరేంటో తెలియదు. నోరారా 'అవ్వా' అనడం మాత్రం తెలుసు.తల్లికి మాత్రం పిల్లవాడి పేరు తెలుసు.అయినా ఆమె వాడిని 'చిన్నా!' అని ముద్దుగా పిలుస్తుంది.వీధిలోని పిల్లలుకూడా వాడిని అలాగే పిలుస్తుంటారు. వీధి పిల్లలకే కాదు, రాంపూర్‌లోని చాలా మందికి వాడు చిన్నా అని మాత్రమే పరిచయం.ఆ రోజున వాడు వీధి పిల్లలతో బొంగరాలాడుతున్నాడు. బొంగరాలాటలో ఆ పిల్లవాడికి ఎదురే లేదు. బొంగరానికి తాడు చుట్టి నేలపై తిరుగుతున్న బొంగరం పైకి గురి చూసి విసిరాడు.అంతే! కింది బొంగరం రెండు ముక్కలైంది. పగిలిన బొంగరపు అబ్బాయి గొడవ పడ్డాడు. కోపమొచ్చిన చిన్నా వాడి తలపైకి ఓ రాయి విసిరాడు. వాడు తలపట్టుకుని 'అవ్వో! అయ్యో!' అంటూ ఏడ్వసాగాడు.

"అరేయ్... దొంగ లంజకొడకా... మా అవ్వకు చెప్త.మా అయ్యను తీసుకొస్త... నిన్ను కొట్టిపిస్త...." అంటూనే తండ్రిని పిలవడానికైవెళ్లాడు.

"పోరా! పో!... మీ అయ్యనె గాదు... మీ తాతను పిలుసుకరా! నాకేమన్న బయమా? నేను గూడ మా అయ్యను తీసుకస్త!" అంటూ ఇంటి వైపు కదిలాడు.

చిన్నా. ఒక్క క్షణం ఆగి ఏదో ఆలోచించసాగాడు.

"అందరికి అయ్యలున్నరు. మరి నాకెందుకు లేడు?ఉంటే ఏడున్నడు? ఇంటికెందుకు రాడు?" ప్రశ్నల సుడితో వాడితల పోటెక్కింది. హూ! ఒక్కదానికి కూడా సమాధానం లేదు. ఒక్క ఉదుటున ఇంటికి పరుగెత్తాడు.

వాడి తలలో ఒకే ఒక్కప్రశ్న మెదులుతుంది. 'తన అయ్య ఎవరు? అయ్య ఎవరు?'.

ఆకాశానికి వేలాడుతున్న మబ్బుల నుండి వర్షం ఒక్కసారిగా కురిసి ఆగిపోయినప్పటికీ, ఆ తాలూకు చినుకులు మాత్రం గుడిసెలో మెల్ల మెల్లగా బొట్లు బొట్లుగా పడుతూనే ఉన్నాయి. లోపలంతా నీరు. సాయంకాలం వెలుగు క్రమేణా కనుమరుగవుతుంది. దొంగలా అడుగులు వేస్తూ చీకటి గుడిసె లోపలకు ప్రవేశించింది.

అయినా దీపం వెలిగించకుండా ఒక మూలలో ముడుచుకొని కూర్చున్నాడు పిల్లవాడు.

వాడికిప్పుడు వెలుతురు అవసరం లేదు.

'అయ్య ఎవరు?' అనే ప్రశ్నకు సమాధానం కావాలి.

అవ్వ తలుపులు తెరచుకొని లోపలకు రావడాన్ని వాడు కళ్ల కింది నుండి చూశాడు. ఆమెతోపాటు ఒక పోలీస్. ఇద్దరూ లోపలకు వచ్చారు. చిమ్నీ సన్నగా వెలిగించింది. వచ్చిన పోలీస్‌తో అవ్వ ఏదేదో మాట్లాడింది. గుసగుసలు... గుసగుసలు... ఆ పోలీస్ కాసేపు తర్వాత వెళ్లిపోయాడు.

మళ్లీ సీసా ఎత్తి తాగుతూ కూర్చుంది అవ్వ. ఇదంతా గమనిస్తున్న పిల్లవాడు మెల్లగా లేచి అవ్వ దగ్గరకు వచ్చాడు. ముభావంగా ఆమె ముందు కూర్చున్నాడు. అవ్వ వాడిని నిశితంగా చూసింది.

"ఏమైందిరా! గట్ల ముడుసుకొని కూసున్నావ్! జరం గిరం అచ్చిందా ఏంది?" అంది.

'లేదు' అన్నట్లుగా తలాడించాడు.

"గట్లయితే ఎందుకిట్ల కూసున్నావ్? ఒక్క సుక్క తాగుతవేంది? ఒక్క సుక్క తాగుతె జాలు! జరం గిరం, రోగం నొప్పి అన్ని దెంకపోతయ్" అంటూ సీసా ముందు పెట్టింది అవ్వ.

అవేమి పట్టించుకోకుండానే "అవ్వా!...అయ్య ఎవరే?... ఏడున్నడే?" తాపీగా అడిగాడు పిల్లవాడు.

అవ్వ చేతిలోని సారాసీసా జారి ముక్కలు ముక్కలైంది. ఎక్కిన నిషా సర్రున దిగి ముచ్చెమటలు పోశాయి. కాళ్లల్లో వణుకు పుట్టింది. "చి...చి...చిన్నా! అయ్య గురించి అడుగుమని నీకెవల్లు చెప్పిండ్రు?" అంది అవ్వ.

"ఎవల్లెందుకు చెప్తరు? నాకేం తెల్వదా ఏంది? నా దోస్తులందరికి అయ్యలున్నరు. నాకెందుకు లేడు? ఉంటే ఇంటికెందుకు రాడు?" బింకంగా అన్నాడు చిన్నా.

కొడుకు మాటలకు ఏం చెప్పాలో తోచని అవ్వ వాణ్ణి ఎదకు హత్తుకొని ఏడ్వసాగింది. మాటబయటకు రాకమౌనిలా నిల్చింది. కొడుకు ప్రశ్నకు సరైన సమాధానం ఆమెకూ తెలియదు. తెలిస్తే తానే చెప్పేది.

"అవ్వా!... ఇప్పుడచ్చిన పోలీస్ ఎవల్లే? ఎందుకచ్చిండు?" మళ్లీ ప్రశ్నించాడు చిన్నా.

కలవరం చెందిన అవ్వ "ఆయన మీ అయ్య తరపు మనిషిరా!" సర్ది చెప్పింది.

"గట్లయితె అయ్య ఏడున్నడె?" పట్టిన పట్టు వదలలేదు పిల్లవాడు.

"చిన్నా! మీ అయ్య దూరంగా ఏదో ఊల్లె ఉన్నడు. ఆయన పెద్ద పోలీస్ సార్. ఇంటికి వచ్చేతందుకు పురుసత్ లేదు. గందుకె ఈ పోలీస్‌తో అప్పుడప్పుడు రూపాయలు పంపుతడు." బుజ్జగిస్తూ చెప్పింది.

అవ్వ మాటలు వినగానే పిల్లవాడికి స్వర్గంలో విహరించినట్లనిపించింది. తండ్రి పోలీస్ అని ఉబ్బితబ్బిబ్బయినాడు. ఆనందాతిరేకంతో నఖశిఖ పర్యంతం పులకితుడైనాడు.

అలాగే అవ్వ ఎదపై ఒదిగిపోయి "అవ్వా!... నేను... అయ్య లాగా పోలీసయిత." అన్నాడు.

అవ్వ ఏమీ పలుకలేదు. చెప్పడానికి ఏమీ తోచలేదు. వాడు తల్లి తొడపైకి జారిపోయాడు. అక్కడ నుండి కలల్లోకి జారిపోయాడు.

మళ్లీ కలలు. అవే రెక్కలు... అవే చుక్కలు... అదే చంద్రుడు... అదే ఆకాశం...

దట్టమైన మీసాలున్న ఖాకీడ్రెస్ ధరించిన ఒక వ్యక్తి జీపులో ఇంటి ముందుకు వచ్చినట్లు, తాను ఆయనతో పాటు జీపులో కూర్చున్నట్లు, తినడానికేదో తనకు ఇచ్చినట్లు, జీపులో కూర్చొని వీధిలో ఒక రౌండ్ తిరిగినట్లు, పిల్లలందరి ముందు తాను చేతిలో లాఠీ పట్టుకొని నేలపై తట్టుతూ, 'అరేయ్!.. మాఅయ్య పోలీస్ ఇన్‌స్పెక్టర్' అన్నట్లు... ఇంకా ఏమేమో రంగు రంగుల కలలు కంటి నిండా కంటున్నాడు. మందహాసంతో ముఖం వికసించింది.

కళ్లు మూసుకుని తొడపై పడుకున్న కొడుకు ముఖాన్ని చూసింది అవ్వ.

"అవును! నేను కూడా మొదట్ల చిన్నగున్నప్పుడు ఇట్లనె కలలు కనేదాన్ని. అవి పెరిగి పెద్దవయ్యేసరికి కన్నతల్లి పోయింది. అయ్యనే అయ్య- అవ్వ అయిండు. కాని అయ్యను గుర్తుకు తెచ్చుకుంటె పెయ్యంత మండుతది.

అవ్వ జచ్చిన ఏడు రోజుల్లోనే అయ్య మారుమనువు చేసుకొన్నడు. ఆమె గయ్యాళి గంప. రాకాసి రంప. నాలో పెరుగుతున్న సోకుల్ని చూసి, నా వొంపు సొంపుల్ని చేత్తో తడిమి తడిమి సంబర పడేది. కొన్ని రోజులుకాంగనె, మెత్తమెత్తటి మాటలతో మోసం చేసి తెలువని మనుషుల్ని నా పక్కకు పంపేది. అద్దంటే కొట్టేది అయ్యనేమో హుక్కాలో గంజాయి నింపుకొని పీల్చుకుంట దునియానే మరిసిపోతడు.

ఆ ఇంటి బాదలు సయించలేక ఏడైనా కట్టపడి తిని బతకవచ్చని దెంకపోయి ఈడికచ్చిన. కాని పొట్టనిండ బువ్వ దొరకలేదు. ఇగ దారి లేక మరుమన్న తల్లి నేర్పిన ఆటనే ఆడుతున్న. బతుకుతున్న. ఇట్ల బతుకుతూ సంపాదించింది ఒక్కటే. అది ఈ చిన్నా! వాడు బత్కాలంటె నా బతుకు ఇట్ల కట్టపడాల్సిందె. దమ్ము- దగ్గు, రోగం- నొప్పి అన్ని తల్గుతయి, అంత నా కర్మలో రాసుంది." విషయాలన్నీ ఒక్కటొక్కటి జ్ఞాపకం వచ్చి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. బిగ్గరగా ఏడ్వాలనిపించింది. కాని ఎందుకో ఏడ్వలేదు. సారా ఎత్తి గటగటా తాగేసింది.

ఆ రోజు కారటిగ సంత. కారటిగ అటు పట్టణమూ కాదు. ఇటు పల్లెటూరు కాదు, త్రిశంకు స్థితిలో ఉన్న ఊరు అది. అక్కడి ప్రజల బతుకూ అంతే. రాంపూర్ నుండి కేవలం మూడు మైళ్ల దూరంలో ఉన్న ఆ ఊరి సంతకు తప్పనిసరిగా వెళ్లిరావడం తల్లీ కొడుకులకున్న అలవాటు. ఆ రోజు సంతలో చిన్నా చేయి పట్టుకొని అవ్వ వేగంగా నడవ సాగింది. సినిమా టాకీస్ దగ్గరకు చేరుకోగానే చిన్నాకు చెప్పలేని ఆనందం కల్గింది. ఖాకీ బట్టలు ధరించిన రాజ్‌కుమార్ నిలువెత్తు కటౌట్‌ను చూసి ఆశ్చర్యపోయి చిన్నా నోరు తెరచి చూస్తూ నిల్చున్నాడు. కౌంటర్ ముందున్న గుంపులో చొరబడిన అవ్వ కన్ను మూసి తెరిచేలోగా టికెట్ తీసుకొచ్చింది.

చిన్నాతో పాటు అవ్వ టాకీస్‌లోకి వెళ్లింది. 'చెలరేగిన సింహం' సినిమా పేరుపడింది. సగం సినిమా తెరపైన సగం సినిమా గోడపైన పడసాగింది. రాజ్‌కుమార్ బొమ్మ, తెరపైకి రాగానే ఈలలు, అరుపులతో టాకీస్ దద్దరిల్లింది. అవ్వ కూడా నోట్లో వేళ్లు పెట్టి ఈల వేసినప్పుడు చిన్నాకు సంతోషంతో శరీరముప్పొంగింది. గంట గడిచినా ఈలలు పడుతూనే ఉన్నాయి. ఫైటింగ్ సీను వచ్చినప్పుడల్లా ఆవేశంతో "ఎయ్..ఎయ్... కొట్టు..." అంటూ చిన్నా అరిచాడు.

"అవ్వ జెప్పినట్లు అయ్య గూడా గిట్లనే ఉండచ్చు. నేను కూడా పెద్ద ఇన్‌స్పెక్టర్‌నయి దొంగలను గిట్లనె పట్టుకోవాలె. పెద్ద ఫైటింగ్ చెయ్యాలె" చిన్నా ఊహల్లో తేలిపోతున్నాడు. రెండు గంటల తర్వాత సినిమా వదిలారు. చిన్నా ఈ ప్రపంచంలోకి వచ్చాడు. పక్కకు తిరిగిచూశాడు.

అక్కడ అవ్వ లేదు. గాబరాగా బయటకు వచ్చాడు. కళ్ళతోనే చుట్టు పక్కలా వెదకసాగాడు. దూరంగా ఒక మూలలో ఎవరితోనో



మాట్లాడుతూ నిల్చుంది అవ్వ. ప్రతివారం సినిమా చూడ్డానికి వచ్చినప్పుడు తాను మాత్రమే సినిమా చూడడం, అవ్వ ఎవరితోనో మాట్లాడుతూ ఉండడం కొత్తేమికాదు. అవ్వ ఎందుకిలా చేస్తుందో పసివాడికి అర్థంకాలేదు. అర్థంకావల్సిన అవసరమూలేదు. వాడిక్కావాల్సింది అవ్వతో పాటు ఇలా వచ్చి ఒక సినిమా చూసి, ఉడిపి హోటల్లో దోశ తిని ఇంటికి తిరిగి వెళ్లడమే. "ఈ అంగడి ప్రతిరోజూ ఎందుకు జరుగుదు?" ఇది చిన్నాను వేధించే మరో ప్రశ్న.

చెలరేగిన సింహంలోని రాజ్‌కుమార్‌లా పోలీస్ డ్రెస్ తొడుక్కోవాలనే కోరిక పిల్లవాడిలో ఇంతింతై... పర్వతమంతైంది. "ఎట్లయినా సరే! రాజ్‌కుమార్‌లాగా, అయ్యలాగా పోలీస్ కావాలి" చిన్నా తన భవిష్యత్తు నిర్ణయించుకున్నాడు. అవ్వ పొయ్యి ఊదుతూ కూర్చుంది. పొగ ముసురుకొంది. పిల్లవాడు అవ్వ దగ్గరకు వెళ్లి కూర్చొని "అవ్వా!" అన్నాడు. అవ్వ పొగనిండిన కళ్లతో చూసింది.

"అవ్వా!... రేపు అంగట్ల పోలీస్ డిరస్ కొనిస్తవా?" అడిగాడు. అవ్వ సాలోచనగా చూసింది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అది పొగవల్లనో? బాధవల్లనో? అనేది మాత్రం చిన్నాకు తెలియదు.

"పోరా!... అట్ల దరిద్రులమైన మన దగ్గర మీ అయ్య ఏమైన పైసలుంచిండ? ఏంది?" తల నిమురుతూ చెప్పింది అవ్వ.

"మల్ల ఆ పోలీస్ అస్తడు కద! నాకు పోలీస్ డెరస్ కావాలని, అయ్యను కొని వంపించుమని ఆయన్తో చెప్పు" అన్నాడు చిన్నా.

"అట్ల కాదురా! మీ అయ్య శాన అంటే శాన దూరంలో ఉన్నడు" అసహనంతో అంది.

"దూరం దూరం అంటే ఎంత దూరం? ఈడి నుండి కారటిగ సినిమా టాకీస్ అంత దూరంల ఉంటడా?" పిల్లవాడి దృష్టిలో రాంపూర్‌లోని తన గుడిసె నుండి కారటిగ సినిమా థియేటర్ చాలా దూరం.

"ఎక్కడుంటెందుకు? నువ్వేం జేస్తవ్? సప్పుడు జెయ్యక కూసోరాద? నోటికచ్చినట్లు మాట్లాడద్దు" కోపంతో గద్దించింది.


"నాకన్ని తెలుస్తున్నయ్. నేనేమి చిన్నపిల్లగాన్ని కాను. నాకయ్యను జూపించు. అయ్య పేరేందో జెప్పు." పట్టిన హఠం విడిచేలా కనిపించలేదు.

అవ్వ నిట్టూర్చింది. "చిన్నా! నీ అయ్యెవల్లు? ఏడుంటడు? ఎట్లుంటడు? పేరేంది?... ఇట్ల అడిగితే నేనేం చెప్పాలా... తెలిస్తే నే జెప్పకపోదునా? నా బతుకు తొవ్వల పడిన అడుగులు ఎవల్లవంటె ఏమని చెప్పాలా? నా తొవ్వల ఎందరో ఆడుకొండ్రు. ఎందరి చేతులల్లనో నలిగిపోయిన. నోరు మూసుకొని ఏడుపు నాపుకొన్న నా బాదలెవల్లకు తెలుసురా?... నా బతుకే గింత. ఒకసారి నా దగ్గరకు అచ్చిపోయిన మీ అయ్య మల్ల ఈ తొవ్వలకు అస్తడో... రాడో... తెల్వదురా?" మోకాళ్లలో ముఖం పెట్టుకొని ఏడ్వసాగింది. చిన్నాకు ఒక్క ముక్కా అర్థంకాలేదు. మిటమిట ముఖం చూస్తూ కూర్చున్నాడు.

మళ్లీ వారంలో సంత. బట్టల అంగడిలో నూరురూపాయలతో అవ్వ చిన్నాకు పోలీస్ డ్రెస్ కొనిచ్చింది. దాన్ని తొడుక్కున్న చిన్నా అద్దం ముందు నిల్చున్నాడు. మళ్లీమళ్లీ చూసుకొన్నాడు. మురిసిపోతున్నాడు. నమ్మలేకపోతున్నాడు. "చెలరేగిన సింహం" రాజ్‌కుమార్‌లా నిలువెత్తుగా ఉన్నాననుకొన్నాడు. అవ్వ చేయి పట్టుకొని వీధిలో నడుస్తున్నాడు. కిరాణంలోని వాళ్లు, హోటల్లోని వాళ్లు, కూరగాయలు, పళ్లు అమ్మేవాళ్లు, రిక్షా తొక్కేవాళ్లు, కార్లల్లో పోయేవాళ్లు అందరూ తననే చూస్తున్నట్లనిపించింది. తడబడ్డాడు. సిగ్గుపడ్డాడు. మళ్లీ తలెత్తి కాలర్ సవరించుకొని అడుగులు వేయసాగాడు.

అవ్వతోపాటు ఒక ఉడిపి హోటల్లో దోసె సమారాధన పూర్తికావించాడు. ఆ తర్వాత కొద్ది సేపట్లోనే అవ్వతో అదే టాకీస్ చేరుకొన్నాడు. మూడువారాలు గడిచినా అదే సినిమా ఆడుతుంది. సినిమా చూస్తానని పిల్లవాడు హఠం పట్టాడు. "చిన్నా నువ్వొక్కనివే సినిమా జూడు. ఊల్లె నాకింక పనుంది. సిన్మా అయినంక ఈడనే ఉండు. నేనచ్చి నిన్ను కొండపోత" అని అవ్వ టికెట్ కొని వాడి చేతిలో ఉంచి వెళ్లింది.

ఆదే సినిమా, ఆదే ఫైటు, అవే పాటలు. రెండుగంటలు పిల్లవాడు మైమరచిపోయాడు. తాను తొడుక్కున్న ఖాకీ బట్టలను నడుమ నడుమ తడిమి తడిమి చూసుకోవడం మాత్రం



మరచిపోలేదు.

సినిమా వదిలి అరగంట దాటినా అవ్వ రాలేదు. చుట్టూ కలయజూశాడు. ఓ బంగళా ముందు పోలీస్ జీపు. ఒక్క ఉదుటలో పరుగెత్తి దాని ముందు నిల్చున్నాడు. జీపు అద్దంలో తన ముఖాన్ని చూసుకొన్నాడు. జీపు బాడీని చేయితో తాకి పులకించిపోయాడు. అయ్యా జీపు కూడా గిట్లనె ఉంటది" అనుకొన్నాడు. మైమరచిపోయి చాలాసేపు అక్కడే ఉన్నాడు.

పక్కనున్న బంగళాలో ఏదో గొడవ వినిపించింది. నలుగురు పోలీసులు ఐదారుగురు ఆడవాళ్లను పట్టుకొని మెట్లు దిగుతున్నారు. వారిలో అవ్వ. ముఖంపై చీరకొంగును కప్పుకున్న అవ్వను క్షణంలో గుర్తించగలిగాడు చిన్నా. కంగారు పడ్డాడు. పరుగెత్తుకొని వెళ్లి అవ్వ చెయ్యి పట్టుకున్నాడు. పోలీసులు ఆడవాళ్లను అసభ్యంగా తిడుతూ జీపులోకి ఎక్కిస్తున్నారు.

"అవ్వా!... వీల్లెందుకు నిన్ను పట్టుకపోతున్నరు? నువ్వేడికి పోతున్నవ్?" అన్నాడు చిన్నా. వాణ్ణి దగ్గరకు తీసుకొని ఏడ్వసాగింది అవ్వ. "పిల్లందరు మీ అయ్య తరపువాళ్లు... నన్ను మీ అయ్య దగ్గరకు కొండవోతున్నరు" అంది.

"గట్లయితె నేను అస్త. నన్ను గూడ అయ్య దగ్గరకు కొండపో నేను అస్త..." హఠం పట్టాడు పిల్లవాడు. ఒక పోలీస్ పిల్లవాడి రెక్కలు పట్టుకొని దూరంగా నెట్టేసి, అవ్వను జీపులోకి ఎక్కించాడు. దుమ్ము రేపుకుంటూ జీపు వెళ్లింది. "నేనస్త... నేనస్త..." అని ఏడుస్తూ జీపు వెనుకనే చిన్నా పరుగెత్తసాగాడు. ముందు జీపు వెనుకనే చిన్నా.

ఐదారు నిమిషాల్లో జీపు పోలీస్‌స్టేషన్ చేరుకొంది. పోలీసులు జీపులోని ఆడవాళ్లను స్టేషన్‌లోకి లాక్కెళ్లారు. దమ్ము తీస్తూ ఆయాసంతో పరుగెత్తుకుంటూ వచ్చిన చిన్నా స్టేషన్ గేట్ దగ్గరకు చేరుకున్నాడు. గేట్ లోపలకు సెంట్రీ రానివ్వలేదు. అక్కడే నిల్చొని లోపలకు తొంగి చూశాడు. గుండె గుభేల్మంది. ఒక పోలీస్ లాఠీతో అవ్వను కొడుతున్నాడు. అవ్వ పోలీస్ కాళ్లపై పడి బోరున ఏడుస్తుంది. సెంట్రీ కళ్లుగప్పి చిన్నా ఒక్కసారిగా లోపలకు వెళ్లి అవ్వను చుట్టేసి ఏడ్వసాగాడు. వాడికి కూడా నాలుగైదు దెబ్బలు తాకాయి. వాడి లేతవీపుపై కరకు లాఠీ నాట్యమాడింది.

దెబ్బలు కొట్టి అలసిపోయిన పోలీస్ పక్కకు వెళ్లాడు. చిన్నా అవ్వ ముఖాన్ని పైకెత్తాడు. అవ్వ ఏడుస్తూనే ఉంది. చిన్నాకు మాత్రం కష్టంగా ఉంది. "అవ్వా!... వీల్లెందుకు నిన్ను కొడ్తున్నరే? చెప్పే..." అన్నాడు. అవ్వ పెదవి చిట్లి రక్తం కారసాగింది. మాట తడబడుతుంది. "బిడ్డా! చిన్నా! వీల్లు... వీల్లు మీ అయ్య తరపు వాళ్లురా!...అందుకె ఇట్ల కొడ్తుండ్రు... నువ్వీడికెందుకచ్చినవురా? వీల్లు నిన్ను గూడా ఇడిసిపెట్టరు.... లోపల ఏన్నరు... ఇప్పుడే మనూరికి ఎల్లిపో! నేన్రేవస్త... ఇగో ఈ రెండ్రూపాయలు తీసుకపో!" అంటూ రూపాయలు జేబులో పెట్టింది. చిన్నాకు కోపం వచ్చింది. "నేను పోనంటె పోను... ఈడ్నే ఉంట... వీల్లందరు బద్మాష్గాల్లు. అందుకె నిన్ను సావ గొడుతుండ్రు. అయ్యగూడా నిన్ను ఇట్లనె కొడ్తడేమో!... అట్లయితే నేను పోలీస్ కానేకాను... నాకీ డిరస్ అద్దే అద్దు... అయ్య కూడా అద్దు. అయ్య తరపువాళ్లందరు బద్మాష్గాల్లే. నాకు నువ్వు కావాలె. నువ్వుకావాలె" అంటూ తొడుక్కున్న ఖాకీ బట్టలను చింపి విసిరేశాడు. ఒక పోలీస్ అమాంతంగా వాణ్ణి ఎత్తుకొని స్టేషన్ అవతలకు విసిరేశాడు. "అవ్వ కావాలె... నాకు అవ్వ కావాలె..." అంటూ నగ్న శరీరంతో చిన్నా రోడ్డు పై పడి పొర్లాడుతున్నాడు.ఏడుస్తున్నాడు. రోడ్డుపై తిరిగే జనం గమ్మున నిల్చొని చోద్యంగా చూస్తున్నారు.